## క్లుప్తంగా

### నంబర్ ప్లేట్ తప్పనిసరి

ఎస్‌ఐ గిరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

పెద్దేముల్: ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పకుండా ఉండాలని పెద్దేముల్ ఎస్‌ఐ గిరి అన్నారు. సోమవారం మండలంలోని తట్టెపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని ఏడు వాహనాలకు, ట్రిపుల్ రైడింగ్ మూడు వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ద్వీచక్ర వాహనాలను మైనర్లకు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### వెంకటయ్యకు మళ్లీ సొసైటీ ఉద్యోగం

కోర్టు ఉత్తర్వులతో విధుల్లోకి..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: నావంద్గీ సొసైటీ మాజీ సీఈఓ వెంకటయ్యను పాలకవర్గం మళ్లీ విధుల్లోకి తీసుకుంది. ఈ మేరకు సోమవారం చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో పాలకవర్గం తీర్మానం చేసింది. గతేడాది ఫిబ్రవరిలో సొసైటీ ఆధ్వర్యంలో జరిపిన శనగల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో సీఈఓ ఉద్యోగం నుంచి పాలకవర్గం తొలగిస్తూ కేసు కూడా నమోదు చేసింది. అయితే, తన ప్రమేయం లేకున్నా అక్రమంగా తొలగించారని వెంకటయ్య హైకోర్టును ఆశ్రయించడంతో ఉద్యోగంలో చేర్చుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు వెంకటయ్య సోమవారం విధుల్లోకి తీసుకుంది. ఇదిలా ఉండగా తనకు సీఈఓ పోస్టు ఇస్తేనే ఉద్యోగంలో చేరుతానని, లేదంటే మళ్లీ కోర్టును ఆశ్రయిస్తానని వెంకటయ్య పాలకవర్గానికి తెగేసి చెప్పారు. దీనిపై పాలవకర్గం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు రంగారెడ్డి, అశోక్ చంద్ర గౌతం, బి.శ్రీనివాస్‌రెడ్డి, నారా గోపాల్ రెడ్డి, నర్సిరెడ్డి, సీఈఓ బందెయ్య పాల్గొన్నారు.

### జూలై నుంచి ఖరీఫ్ రుణాలు

- దీర్ఘకాలిక రుణాలు వెంటనే చెల్లించాలి
- సీఈఓ రాజమౌళి



తట్టెపల్లి సీఈఓ రాజమౌళి

పెద్దేముల్: 2023–24 సంవత్సరానికి గాను రైతులకు ఖరీఫ్ రుణాలు జూలై మొదటి వారం నుంచి ఇచ్చేందుకు సంఘం సిద్ధంగా ఉందని సోమవారం పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సీఈఓ) రాజమౌళి తెలిపారు. సంఘంలోని 18 గ్రామాల్లో 2200 మంది సంఘం సభ్యులు ఉండగా, ఇప్పటివరకు సుమారు 900 మంది రైతులకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ఏడాది ఇచ్చిన రుణాల్లో 42శాతం రుణాలు రికవరీ అయ్యాయని, మరో 20 శాతం అయిన వెంటనే కొత్త రుణాలు ప్రారంభిస్తామని చెప్పారు. అర్హత గల రైతులకు కోళ్ల ఫారం, కొత్త ట్రాక్టర్ల కోసం రుణాలు ఇచ్చేందుకు సంఘం సిద్ధంగా ఉందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. ఇప్పటివరకు 20టన్నుల డీఏపీ, 200టన్నుల యూరియా ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. త్వరలో మళ్లీ ఎరువులు రాబోతున్నాయని తెలియజేశారు. సుమారు ఐదు సంవత్సరాల నుంచి సంఘం పరిధిలోని ఇందూరు, అడ్కిచెర్ల, బండమిదిపల్లి, పాషాపూర్, ఓంలానాయక్‌తండా, ఆత్కూర్, తట్టెపల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాల రైతుల సహకారంతో బ్యాంకు లాభాల బాటలో కొనసాగటం జరుగుతుందన్నారు. అంతేగాకుండా చిన్న చిన్న వ్యాపారస్తులు స్వయం ఉపాధి కోసం ఈ ఏడాది రుణాలు పెంచడం జరిగిందని సీఈఓ తెలిపారు. రూ.35వేల దానిని ప్రస్తుతం రూ.50వేల వరకు రుణం ఇచ్చేందుకు సంఘం సభ్యులు తీర్మానం చేయడం జరిగిందన్నారు. పంట రుణాలు తీసుకొని సక్రమంగా కట్టిన వారికి మొదటి ప్రాధ్యానం ఉంటుందన్నారు. గతంలో రుణాలకే పరిమితమైన బ్యాంకు చైర్మన్, సంఘ సభ్యుల సహకారంతో ప్రస్తుతం బంగారు రుణాలు కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు బంగారంపై సుమారు రూ కోటి 10లక్షల వరకు ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాంకు రూల్స్ ప్రకారం బంగారంపై రుణం ఇవ్వటం జరుగుతుందన్నారు. 2000 నుంచి 2005 వరకు సుమారు రూ.రెండు కోట్ల వరకు నష్టంలో ఉండగా, 2021 సంవత్సరం నుంచి లాబాల్లో బాటల్లో సంఘం కొనసాగుతోందన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించటం, సంఘ సభ్యుల సహకారంతో ముందుకు కొనసాగటం జరుగుతుందన్నారు.

# రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్

ఏఈఓ శిరిష

తాండూరు రూరల్: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్ నమోదు చేయిస్తామని సిరిగిరిపేట్ ఏఈఓ శిరిష హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని అల్లాపూర్‌లో విత్తన కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచులోని విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. విత్తన ప్యాకెట్లు, బిల్లులు పంటకాలం పూర్తియ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

**విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి**

పరిగి: విత్తన కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాల పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని అన్నారు. నాణ్యమైన విత్తనాలతో సాగు చేస్తేనే అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. ఎంఆర్‌పీ ధర కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**రైతులకు అవగాహన**

బొంరాస్‌పేట: పంటల సాగులో రైతులు నాణ్యమైన విత్తనాలను వాడాలని ఏఈఓలు రైతులకు విధిగా సూచిస్తున్నారు. సోమవారం మండలంలోని రేగడిమైలారం, మూడుమామిళ్లతండా, బాపన్‌చెర్వుతండా గ్రామపంచాయతీల్లో ఏఈఓ హేమ, దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి, నాన్యానాయక్‌తండా, చిల్మల్‌మైలారం, సంద్రకుంటతండాలో ఏఈఓ



పరిగి: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి

అహ్మద్ మొయియొద్దీన్ రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. పత్తిలో గడ్డిమందును తట్టుకునే రకాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో దుద్యాల మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**జాగ్రత్తలు తీసుకోవాలి**

దోమ: రైతులు వానాకాలం సీజన్‌కు సంబంధించి విత్తన కొనుగోళ్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు అన్నారు. దోమ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఆవరణలో ఆయా గ్రామాల రైతులతో కలసి విత్తన కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, రైతులు ఉన్నారు.

**గుర్తింపు పొందిన డీలర్ల వద్దే కొనాలి**

మర్పల్లి: వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గరనే ఖరీఫ్‌లో విత్తనాలు సాగు చేసేందుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేయా



బొంరాస్‌పేట: అవగాహన కల్పిస్తున్న ఏఈఓ మొయియొద్దీన్

లని సిరిపురం క్లస్టర్ రైతు వేదిక ఏఈఓ మహేశ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని సిరిపురం, మర్పల్లి, కల్‌ఖోడ, పట్లూర్, బిల్‌కల్ పరిధిలోని గ్రామాల్లోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్ సాగుపై విత్తనాల కొనుగోళ్లపై అవగాహన నిర్వహించి, సలహాలు, సూచనలు చేశారు. ఖరీఫ్ పంట సాగు కోసం విత్తన డీలర్ల వద్ద కొ ను గోలు చేసే విత్తనాలు లూజుగా ఉన్న బస్తాలలో విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నీరజ, కల్‌ఖోడ క్లస్టర్‌లో ఏఈఓ స్వాతి, పట్లూర్ క్లస్టర్‌లో ఏఈఓ ప్రశాంత్ అవగాహన కల్పించారు.

## తప్పకుండా రసీదు తీసుకోవాలి

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: దుక్కులు దున్నారు.. దిక్కులు చూస్తున్నారు.. అనే శీర్షికతో సోమవారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించారు. మండల ఏఓ నజీరోద్దిన్, ఏఈఓ బాలు, జ్యోతి పలువురు అధికారులు గ్రామాలకు చేరుకొని రైతులకు ఖరీఫ్‌పై సూచనలు, సలహాలు ప్రారంభం చేశారు. సోమవారం పెద్దేముల్ మండల గోట్లపల్లి, గోపాల్‌పూర్, రుక్మాపూర్, కందనెల్లి,ఖాణాపూర్, ఇందూరు, జయరాం తండా గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నజీరోద్దిన్ రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు ఖరీదు చేసిన వెంటనే తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా లూజు విత్తనాలు అసలుకే ఖరీదు చేయరాదన్నారు. ఎవరైన లూజు విత్తనాలు విక్రయాలు చేస్తే వ్యవసాయ, లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన డీలర్ దుఖాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులకు అవసరం



పెద్దేముల్: రైతులకు సూచనలు ఇస్తున్న ఏఈ

ఉంటే మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో బిల్లు తీసుకోని తాండూరు కార్యాలయంలో విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

## కుట్టుతో ఉపాధి



దౌల్తాబాద్‌లో స్కూల్ డ్రెస్‌లు కుడుతున్న మహిళలు

దౌల్తాబాద్: నిన్నమొన్నటి వరకు చాలా మంది మహిళలు ఆర్థిక పరిస్థితులు బాగా లేక మధ్యలో చదువులు మానేసి కుటుంబపోషణకు కూలీ పనులకు వెళ్లేవారు. ఇలా చాలా మంది మహిళలు పొదుపు సంఘాల్లో గుర్తింపు ఉన్నప్పటికీ స్థిరంగా ఒక పని అంటూ లేకుండా పోయింది. ఇటీవల అలాంటి వారిని గుర్తించిన ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు స్కూల్ డ్రెస్‌ల కుట్టడంపై శిక్షణ ఇచ్చారు. రానున్న 2024–25 విద్యా సంవత్సరం కోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి మండల కేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కుట్టుశిక్షణ కేంద్రంలో 20మంది మహిళలు యూనిఫాంలు కుడుతూ ఉపాధి పొందుతున్నారు.

**నాణ్యతగా చేయిస్తున్నాం..**



స్కూల్ యూనిఫాంలు కుట్టడానికి రోజుకు 20మంది మహిళలు వస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తున్నాం. అధికారులు కూడా పరిశీలిస్తున్నారు. తమకు కేటాయించిన టార్గెట్‌ను పాఠశాలలు తెరిచేలోపు పూర్తి చేస్తాం.

– రేష్మాబేగం, నిర్వాహకురాలు

## లయన్స్ క్లబ్ సేవలు కొనసాగిస్తున్నాం..

క్లబ్ తెలంగాణ జిల్లా గవర్నర్ హరీశ్‌రెడ్డి



మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రతినిధులు

ధారూరు: గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 40 లక్షల వ్యయంతో 10 పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ తెలంగాణ జిల్లా గవర్నర్ హరీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ధారూరు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణానికి సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు సంపూర్ణానంద్‌రావు తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధారూరు, కేరెళ్లి ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం పాఠశాలలు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే మేడ్చల్‌లోని రెండు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య శిబిరాలను నిర్వహించి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. ఇంతకు ముందు ఓ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించి కేవలం రూ. 600 మాత్రమే నామమాత్ర ఫీజుగా తీసుకుంటున్నామని వివరించారు. లయన్స్ క్లబ్ నుంచి పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు సంపూర్ణానంద్‌రావు, జూన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టే లయన్స్‌క్లబ్ తెలంగాణ జిల్లా గవర్నర్ కృష్ణప్రసాద్, లయన్స్‌క్లబ్ తెలంగాణ జిల్లా మాజీ గవర్నర్ ఎన్నారెడ్డి, రీజినల్ చైర్మన్ శీనుసుందర్, లయన్స్‌క్లబ్ జిల్లా కేబినెట్ కార్యదర్శి లక్ష్మీమూర్తి, వికారాబాద్ చైర్మన్ లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మర్పల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిరిపురంలో 1994–95 పదవ తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. నాటి ఉపాధ్యాయుల బృందంతో పాటు స్థానిక మాజీ సర్పంచ్ మల్లయ్య సమక్షంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. పేదరికంలో ఉన్న తోటి విద్యార్థులకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామంటూ భరోసా కల్పించారు. వివిధ రంగాల్లో స్థిరపడి ఆర్థికంగా పురోగతి సాధించిన కొంత మంది విద్యార్థులు పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామంటూ ముందుకు వచ్చారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

### అనారోగ్యంతో జర్నలిస్టు నర్సింహారెడ్డి మృతి



తాండూరు టౌన్: అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు నర్సింహారెడ్డి (55) ఆదివారం రాత్రి మృతి చెందారు. పెద్దేముల్ మండలం గాజీపూర్‌కు ఆయన పలు దిన పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. అనారోగ్యానికి గురైన నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుముశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పలు జర్నలిస్టు సంఘాల నాయకులు నర్సింహారెడ్డికి నివాళులర్పించారు.

### బస్సు సౌకర్యం కల్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య వికారాబాద్ జిల్లా ప్రతినిధులు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పులుమద్ది, ఎర్రవల్లి, సర్పన్‌పల్లి, అత్వెల్లి, మదన్‌పల్లి, పాతూర్, కామారెడ్డిగూడ, బురాన్‌పల్లి, పులుసుమామిడి, పీరంపల్లి, కొటాలగూడ గ్రామాలకు కోవిడ్ కంటే ముందు బస్సు సౌకర్యం ఉందన్నారు. కోవిడ్ తరువాత బస్సులను నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, వెంకటయ్య, ఆశలత, ఉమా, ప్రతినిధులు పాల్గొన్నారు.

### వాటర్ ట్యాంకు అందజేత



వాటర్ ట్యాంక్ అందజేస్తున్న దృశ్యం

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ శివారులో మల్లికార్జున అప్పాజీ (ముత్తా) స్వామి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం కొనసాగుతోంది. తాండూరు పట్టణానికి చెందిన స్వామి భక్తుడు కమ్మరి కృష్ణ ఆశ్రమానికి 10 వేల లీటర్ల పట్టే వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. వృద్ధాశ్రమం చేయూత అందించేందుకు దాతలు ముందుకు రావాలని ట్రస్ట్ చైర్మన్ ధర్మిది రవిశంకర్ కోరారు.

## మిషన్‌భగీరథ నీటిలో పక్షుల ఎముకలు

ఆందోళనలో గ్రామస్తులు

నవాబుపేట: నిత్యం ప్రజలు తాగే మిషన్ భగీరథ నీళ్లల్లో పక్షుల ఎముకలు కనిపించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం వాటర్ మెన్ గ్రామంలోకి తాగునీరు వదిలారు. బీసీ కాలనీలోని అంజయ్య ఇంటి వద్ద నల్లా నీళ్లల్లో పక్షుల రెక్కలు వస్తున్నట్లు గమనించారు. వెంటనే పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పైపులైన్ల వద్ద తవ్వి చూడగా అందులో పక్షుల ఎముకలు, రెక్కలు ఉన్నాయి. దీంతో వాటిని తొలగించారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శి గ్రామానికి చేరుకొని గ్రామంలోని అన్ని గేట్ల వాల్‌లను తెరిచి చూశారు. ట్యాంకుల్లో మరోచోట ఉన్నట్లు ఎక్కడ కనిపించలేదు. అనంతరం అన్ని గేట్‌వాల్‌లను ఓపెన్ చేసి నీళ్లు వదిలారు. ఆ పక్షుల ఎముకలు పైపులైన్లలోకి ఎలా వచ్చాయనేది ప్రశ్నార్థకంగా మారింది.



పులుమామిడిలో తాగునీటి పైపులైన్‌లో బయపడ్డ పక్షుల ఎముకలు

## అభివృద్ధి పనులు ముమ్మరం



బిచ్చాల పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి క్యూరింగ్ చేస్తున్న దృశ్యం



చల్లాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

దౌల్తాబాద్: మండలంలోని 41 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికయ్యాయి. కావునా, అధికారులు పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించేందుకు పనులు ముమ్మరం చేశారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మైనర్ మరమ్మతులకు రూ.1.025కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడతగా రూ.19.65లక్షలు విడుదల చేశారు. గతంలో పాఠశాలల్లో సౌకర్యాలు లేక ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ పనులను మండల స్థాయి అధికారులు పరిశీలిస్తున్నారు. ఇటీవల జిల్లా డీఈఓ రేణుకాదేవి పలు పాఠశాలల్లో పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచేలోగా పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

## గడువు పెంచాల్సిందే..

మోమిన్‌పేట: జొన్నల కొనుగోలు కేంద్రం ఈ నెల 31తో ప్రభుత్వం విధించిన గడువు ముగిస్తోంది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోనున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్నలు ఇంకా మిగిలి ఉండటంతో గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు. మండల పరిధిలోని మేకవనంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రబీలో సాగు చేసిన జొన్నలను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. ఇప్పటికి 387 మంది రైతులకు టోకెన్లు ఇవ్వగా, 275మంది రైతుల నుంచి 7961బస్తాలను కొనుగోలు చేశారు. రూ. 1,26,56,400ల విలువ గల 398 మెట్రిక్ టన్నుల జొన్నలను రైతుల నుంచి కొనుగోలు చేశారు. మిగిలిన జొన్నలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**తరుగు తీయడం లేదు..**



ప్రభుత్వం మద్దతు ధరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నలను కొనుగోలు చేయడం సంతోషం. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2500లకు అమ్ముకోవాల్సి వచ్చేది. అన్ని పోను క్వింటాలుకు రూ.2300లు మిగిలేవి. తరుగు తీయడం లేదు. డబ్బులు కూడా వారం రోజుల్లో ఖాతాలో జమ చేస్తున్నారు.

– రైతు బస్వరాజు, అంరాధికలాన్




కొనుగోలు కేంద్రం వద్ద వెచి ఉన్న వాహనాలు

## ధర కన్నా గేదెకే ప్రాధాన్యం ఇవ్వాలి

- అధిక పాలు ఇవ్వాలంటే జాగ్రత్తలు తప్పనిసరి
- పశువైద్యాధికారి శ్రీప్రియ

నవాబుపేట: రైతులు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం కోసం గేదెలను పెంచుకోవడం అలవాటు. అందుకు వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసే గేదెలు అనుకున్న స్థాయిలో పాలు ఇవ్వకపోతే రైతుకు నష్టంతో పాటు కుటుంబ పోషణ భారమవుతుంది. గేదెను కొనుగోలు చేసే సమయంలోనే రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటూ సమస్యలను అధిగమించవచ్చని మండల పశు వైద్యాధికారి శ్రీప్రియ పేర్కొంటున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- తల చిన్నదిగా, దవడలు గట్టిగా, కళ్లు పెద్దవిగా వెడల్పు నుదురు కలిగి ఉండాలి.
- కాళ్లు నిటారుగా, బలంగా, కొంచెం ఎడంగా ఉండాలి. వెనుక నుంచి చూస్తే తొడలు ఎడంగా ఉండి పొదుగుకు ఎక్కువ చోటు ఉండాలి.
- చర్మం పలుచగా, పక్కటెముకలు ఎడంగా ఉండాలి.
- మెడసన్నగా జబ్బలతో కలసి పోవాలి. వీపు భాగం సమతలంగా వెడల్పుగా ఉండాలి.
- పొట్టభాగం పొడువుగా లోతుగా ఉండి వెనక్కు వెళ్లే కొద్ది వెడల్పుగా ఉండాలి.
- పొదుగు పెద్దదిగా, సమతలంగా శరీరానికి అంటి పెట్టుకొని వెనుక పైవరకు విస్తరించి ఉండాలి. పాలు పితికిన తర్వాత పొదుగు పూర్తిగా తగ్గిపోవాలి. నాలుగు చనులు ఒకే పరిమాణంలో ఉండి పొదుగు మీద చతురస్రాకారంలో అమరి ఉండాలి.
- గేదెను ముందు నుంచి చూసినా, పక్క నుంచి చూసినా త్రికోణాకారంతో ఉండాలి.
- చనులు...పొదుగులో ఎలాంటి గడ్డలు ఉండకూడదు. అలా ఉంటే ఆగేదెకు ముందు ఈతలో పొదుగు వాపు వ్యాధి వచ్చి ఉంటుందని గుర్తించాలి



గేదెలు (ఫైల్)

- పొదుగు .. ఉదరం కింద ఉండే పాలనరం పొడువుగా వంకరలు తిరిగి శాఖలుగా విభజితమై కనిపిస్తుండాలి.
- గేదెలను కొనే సమయంలో ఎప్పుడు ఈనింది, ఎన్నో ఈత, ఈనిన తర్వాత ఎన్ని నెలలు పాడి ఇచ్చింది. కట్టినట్లుయితే ఎన్ని నెలలు చూడు, వట్టిపోయి ఎంత కాలం అయ్యింది. ఈనడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది. వంటి విషయాలు పరిశీలించి కొనుగోలు చేస్తే అధిక పాల దిగుబడి ఉంటుంది.
- సంతలో పశువులను కొనుగోలు చేసే సమయంలో ఆ పశువుకు రంగులు వేయడం, కొమ్ములు చెక్కడం లాంటివి చేశారేమో గమనించాలి.

**జాగ్రత్తలు అవసరం**



గేదెలను కొనేటప్పుడు ధర కన్నా గేదెకే ప్రాధాన్యం ఇవ్వాలి. కొనుగోలు చేసిన గేదెకు సమగ్ర ఆహారం సమకూర్చాలి. ముర్రజాతి గేదెలు శ్రేష్ఠమైనవి. వట్టిపోయినప్పుడు నిర్లక్ష్యం చేస్తే పాలిచ్చే సమయంలో ఇబ్బంది.

– మండల పశు వైద్యాధికారి శ్రీప్రియ

### వారణాసికి తరలిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గానికి సోమవారం షాద్‌నగర్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పసుల నర్సింహ్మా యాదవ్, గడ్డమీది రాజు, బోయ అశోక్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌గుప్తా, విక్రమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.